క్లుప్తంగా

పుస్తక ప్రదర్శన

విద్యారణ్యపురి : హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి మాట్లాడుతూ అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేజనిట్లు, జర్నల్స్ డిక్షనరీలు అనేక రకాల పుస్తకాలు ఉన్నాయన్నారు. పుస్తక ప్రదర్శనలో లైబ్రేరియన్ యుగేందర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోదీ బయోపిక్‌ను తిలకించిన బీజేపీ శ్రేణులు

వరంగల్ చౌరస్తా : దేశ ప్రధాని నరేంద్ర మోదీ బయోపిక్‌ను శుక్రవారం సాయంత్రం వరంగల్ హెడ్ పోస్టాఫీస్‌కు సమీపంలోని ఎస్–2 మాల్‌లో బీజేపీ నాయకులు తిలకించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్, నాయకులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సుమన్‌గౌడ్



కాజీపేట : తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా తడక సుమన్ గౌడ్‌ను నియమించారు. శుక్రవారం కాజీపేట వైష్ణవి గ్రాండ్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం ముగిసిన అనంతరం బీసీల ఐక్యత కోసం అంకితభావంతో పనిచేస్తున్న సుమన్ గౌడ్‌కు రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పిస్తూ జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాలను జారీ చేశారు. ఈమేరకు నియామక పత్రం అందజేశారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి



కాజీపేట : మహిళల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలపై ప్రతి మహిళ సరైన అవగాహన కలిగి ఉన్నప్పుడే ధైర్యంగా పోరాటం చేయడానికి సిద్ధంగా ఉంటారని సఖి కౌన్సిలర్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని సోమిడి ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం మహిళ చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖివన్ స్టాప్ సెంటర్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, శిశుసంక్షేమ శాఖలు మహిళల కోసం 5 రకాల సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సఖి కేసు వర్కర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం

కాజీపేట: కాజీపేటటౌన్ రైల్వేస్టేషన్ సమీపంలో రవాణాకు సిద్ధంగా ఉన్న నల్లబెల్లం, పటికలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని ఓ యువకుడిని అరెస్ట్ చేశారు. శుక్రవారం టౌన్ స్టేషన్ ప్రాంగణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆపి తనిఖీచేయగా నాటుసారా తయారీకి ఉపయోగించే 3.9 క్వింటాళ్ల నల్లబెల్లం, 47 కిలోల పటికను పట్టుకున్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చంద్రుగొండకు చెందిన బాదావత్ అవినాష్ రైలులో వీటిని రవాణా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. తనిఖీల్లో పట్టుబడిన ముడిసరుకును కాజీపేట పోలీసులకు అప్పగించి విచారణ జరుపుతున్నట్లు ఏసీపీ మధుసూధన్ తెలిపారు. తనిఖీల్లో సీఐ బాబులాల్, ఎస్సై చందర్, సిబ్బంది పాల్గొన్నారు.

దసరా బందోబస్తు ఏర్పాటుకు చర్యలు

వరంగల్ డీసీపీ సలీమా



మాట్లాడుతున్న డీసీపీ సలీమా

ఖిలా వరంగల్: రంగలీల మైదానానికి లక్షలాదిగా తరలివచ్చే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు సీసీ కెమెరాల నిఘాతోపాటు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు వరంగల్ డీసీపీ సలీమా తెలిపారు. సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు శుక్రవారం వరంగల్ కమిషనరేట్‌లో పోలీస్ ఉన్నతాధికారులతో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీసీపీ సలీమా మాట్లాడుతూ.. గతం కంటే ఈఏడాది భారీ ఏర్పాట్లు చేస్తున్నామని, నగరంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు చేరుకుని దసరా వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తామన్నారు. ట్రాఫిక్ అవస్థలు లేకుండా పర్యవేక్షణ ఉంటుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్, ఏఎస్పీ శుభం ప్రకాశ్, ఆర్టీఓ సత్యపాల్‌రెడ్డి, ఏసీపీ సత్యనారాయణ, సీఐ బొల్లం రమేశ్, అధికారులు, ఉత్సవ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు సంజయ్‌బాబు గౌడ్, మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్నగౌడ్, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్ పాల్గొన్నారు.

సెల్ఫీ కూడలి.. కళావిహీనం

- రూ. 30 లక్షలతో నిర్మాణం
- పట్టించుకోని అధికారులు



సెల్ఫీ పాయింట్ వద్ద ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు

కాజీపేట: గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 61వ డివిజన్ కేయూ–100 ఫీట్ రోడ్డులో ఏడేళ్ల కింద రూ.30 లక్షలతో నిర్మించిన సెల్ఫీ స్పాట్ కళ తప్పింది. మున్సిపల్ ఆరంభ శూరత్వంలా దీని నిర్వహణను ప్రారంభించి వదిలేయడంతో విరివిగా మొక్కలు పెరుగుతూ సెల్ఫీ పాయింట్ కనిపించకుండా పోతుంది. వావ్ వరంగల్ పేరుతో చూపరుల హృదయాలను ఆకట్టుకునేలా నిర్మించారు. రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగులో వావ్ వరంగల్ అక్షరాల పైనుంచి నీరు జాలువారుతుండటం బాటసారులకు కనువిందు చేసేది. కేయూ రోడ్డులో ప్రయాణం చేసే వాహనదారులు మొదట్లో చిన్న, పెద్ద తేడా లేకుండా ఆగి ఈ సెల్ఫీపాయింట్ వద్ద సెల్‌ఫోన్లలో ఫొటోలను దిగుతూ మురిసిపోయేవారు. రానురాను ఈ సెల్ఫీ పాయింట్ నిర్వాహణను అధికారులు గాలికి వదిలేయడంతో పిచ్చి మొక్కలు విరివిగా మొలుస్తున్నాయి. సెల్ఫీ పాయింట్ నానాటికి బాటసారులకు కనిపించకుండా పోతుంది. మున్సిపల్ కమిషనర్ స్పందించి సెల్ఫీ పాయింట్ వినియోగంలోకి వచ్చేలా చూడాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

రాణిరుద్రమ స్ఫూర్తితో అన్నిరంగాల్లో రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బాలథెరిస్సా జింగ్రాస్

కాజీపేట : ఓరుగల్లు పౌరుషం..రాణిరుద్రమ స్ఫూర్తితో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిస్సా జింగ్రాస్ అన్నారు. 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ పీజీఆర్ గార్డెన్‌లో శుక్రవారం మన పథకం–మన అభివృద్ధి అంశంపై బాలవికాస సంస్థ రాష్ట్రస్థాయి మహాసభను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలథెరిసా మాట్లాడుతూ ఒక గొప్ప లక్ష్యంతో 33 ఏళ్ల కింద ప్రారంభమైన సంస్థ మహిళల అభివృద్ధికి రాచబాటలు వేస్తున్న విషయాన్ని గుర్తించి మరింతగా ఎదగాలని ఆకాంక్షించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారతే కుటుంబ సాధికారత అని, ఒక మహిళా అభివృద్ధి చెందితే ఆ కుటుంబం అంతా అభివృద్ధి చెందుతున్నారు. సమావేశంలో బాలవికాస అధ్యక్షుడు నోముల ఇంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు బాసాని మర్రెడ్డి, జనవికాస అధ్యక్షుడు లూర్దు మర్రెడ్డి, కెనడా సోపార్ డైరెక్టర్ శోభారెడ్డి, రైతు వికాస అధ్యక్షుడు కూసం రాజమౌళి, కెనడా ప్రతినిధులు బెర్నాడ్, మోనిక్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

న్యూశాయంపేట : వరంగల్ రంగశాయిపేట శివారు జక్కలొద్ది మైనార్టీ బాలుర గురుకులాన్ని శుక్రవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మైనారిటీ గురుకులాల్లో టైంటేబుల్‌ను మార్చడానికి సెక్రటరీ షఫియుల్లాతో పలుమార్లు సంప్రదించి టైంటేబుల్ మార్పునకు కృషి చేసి సాధించామని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎమ్మెల్సీని పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భిక్షపతి, ఉద్యోగులు శివాజి, సర్వర్‌మోహియొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద కళాశాలను అప్‌గ్రేడ్ చేయాలి



ఎంపీ కావ్యకు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

వరంగల్ చౌరస్తా : వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలను అప్‌గ్రేడ్ చేయాలని ఆస్పత్రి వైద్య ప్రతినిధులు వరంగల్ ఎంపీ కడియం కావ్యకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హనుమకొండలో ఎంపీని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆయుర్వేద పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల స్థాపనకు కృషి చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో అనంతలక్ష్మి గవర్నమెంట్ ఆయుర్వేద మెడికల్ కాలేజీ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు డాక్టర్ సాంబమూర్తి, అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు మండల పరశురాములు, యునెస్కో యుఎస్ తెలంగాణ స్టేట్ చాప్టర్ కో–ఆర్డినేటర్ ధర్మపురి రాజగోవిందు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు వచ్చిన వరంగల్ ఎంపీ కడియం కావ్య తొలుత అధ్యాపకులతో బోధనేతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బిక్షాలు పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పించేలా చర్యలు చేపట్టాలని, ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులరైజ్ చేయించాలని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ కావ్య మాట్లాడుతూ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అవసరమైన నిధుల సమీకరణకు తనవంతు సహకారం అందిస్తానన్నారు.

జోయాలుక్కాస్‌లో బ్రిలియన్స్ డైమండ్ జ్యువెల్లరీ షో



బ్రిలియన్స్ డైమండ్ జ్యువెల్లరీ షో ప్రారంభంలో పాల్గొన్న ఏసీపీ సతీశ్‌బాబు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తా, పింజర్లవీధిలోని జోయాలుక్కాస్ జ్యువెల్లరీ షోరూంలో శుక్రవారం బ్రిలియన్స్ డైమండ్ జ్యువెల్లరీ షో ను పరకాల ఏసీపీ సతీశ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ షోలో అద్భుతమైన బ్రైడల్ సెట్ల నుంచి ప్రతి రోజూ ధరించే ఆకర్షణీయమైన ఆభరణాల వరకు, సనాతన సంప్రదాయాన్ని ఆధునిక సౌందర్యంతో కలిపిన కళాఖండాలు ఉన్నాయని తెలిపారు. ప్రతీ డిజైన్ అద్భుతంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఇది షో సమయంలో కొద్ది రోజులు మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రత్యేక లాంచ్ ఆఫర్ లో కొనుగోలుదారులు బంగారం, కట్ చేసిన, కట్ చేయనివి వజ్రాలు, విలువైన రత్నాలు, ప్లాటినం, వెండి నగలపై మేకింగ్ చార్జీలు (వీ.ఏ)పై 50 శాతం తగ్గింపు అందిస్తున్నట్లు తెలిపారు.ఈ ప్రదర్శన అక్టోబర్ 5 వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఫ్యాషన్‌షో యువతుల ర్యాంప్‌వాక్ ఆకట్టుకుంది.

సంక్షిప్త సమాచారం

రేపటి నుంచి చదరంగ శిక్షణ శిబిరం

హన్మకొండ చౌరస్తా : దసరా సెలవులను పురస్కరించుకుని ఈ నెల 21 నుంచి ప్రత్యేక చదరంగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కన్నా అకాడమీ డైరెక్టర్ కన్నా శుక్రవారం తెలిపారు. వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

రైతులపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలి

ఖిలా వరంగల్ : రైతాంగం పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి వీడాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి డిమాండ్ చేశారు. శుక్రవారం ఖిలా వరంగల్ మండలం వ్యవసాయ కార్యాలయంలో ఏఈఓ ప్రకాశ్‌కు కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు.

ఉత్సవాలకు రావాలని విజ్ఞప్తి

వరంగల్ చౌరస్తా : వరంగల్ కాశిబుగ్గ చిన్నవడ్డేపల్లి చెరువు శివారులో జరిగే దసరా ఉత్సవ వేడుకలకు హాజరు కావాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును ఉత్సవ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండలోని మాజీ ఎమ్మెల్సీ నివాసంలో కలిసి ఆహ్వానపత్రం అందచేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండ, కాజీపేటలోని పలు ప్రాంతాల్లో నేడు (శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్, యాదవనగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, కాజీపేట, విష్ణుపురికాలనీ, జూబ్లీమార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

విద్యారణ్యపురి : యూత్ ఫర్ సేవా వరంగల్ చాప్టర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల జులైవాడ విద్యార్థులకు శుక్రవారం స్కూల్ బ్యాగులు, జామెట్రిబాక్స్, పెద్ద బాలశిక్ష పుస్తకాలను పంపిణీ చేశారు.

నేటి నుంచి ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

విద్యారణ్యపురి : ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా దామెరలో ఈనెల 20 నుంచి 26 వరకు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఆర్.ప్రవీణ్‌కుమార్, ఎస్. శ్రీనివాస్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

వరంగల్, ఖిలా వరంగల్ తహసీల్దార్ల బదిలీ

ఖిలా వరంగల్ : వరంగల్ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహమ్మద్ ఇక్బాల్ ఖిలా వరంగల్ తహసీల్దార్‌గా, ఖిలా వరంగల్ మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్‌ను వరంగల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించారు. కలెక్టర్ సత్యశారద శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

హన్మకొండ: హనుమకొండ నయింనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల (అటానమస్) 2వ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. శుక్రవారం కాలేజీలో ప్రిన్సిపాల్ ఎ.శేషాచలం, వైస్ ప్రిన్సిపాల్ హరీందర్‌రెడ్డి, ఐక్యూసీ కో ఆర్డినేటర్ రాజాప్రసాద్, పరీక్షల కంట్రోలర్ సి.దత్తాత్రేయులు ఫలితాలు విడుదల చేశారు. మొత్తం 89.29 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కొన్ని కోర్సుల్లో 100 శాతం ఫలితాలు సాధించారన్నారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 87.5 శాతం, కంప్యూటర్స్‌లో 83.33, న్యూట్రిషన్ అండ్ డేటిటిక్స్‌లో 81.81, జువాలజీలో 83.33, ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 88.23 శాతం ఫలితాలు సాధించారన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

హసన్‌పర్తి : క్రీడల్లో గెలుపోటములు సహజమని రిటైర్డ్ ఈఈ సాంబయ్య అన్నారు. స్థానిక పీఎంశ్రీ బాలికల ఉన్నత పాఠశాలలో 2 రోజుల పాటు నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఎంపిక ప్రక్రియ శుక్రవారం ముగిసింది.

చిత్రలేఖనం సామగ్రి అందజేత

విద్యారణ్యపురి: వరంగల్ హంటర్ రోడ్డు బ్రిడ్జి ప్రాంతంలోని ఆకారపు విశ్వేశ్వరయ్య కాంపౌండ్ సంచార కుటుంబాలకు అక్షర చైతన్య కార్యక్రమం ద్వారా మహిళలకు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం సామగ్రి, భాషా నైపుణ్యాలను అభివృద్ధికి మెటీరియల్‌ను శుక్రవారం విద్యావికాస ప్రేరణ ఫౌండేషన్ ఉచితంగా అందజేసింది.

'సుమతిరెడ్డి'లో స్మార్ట్ ఇండియా హాకథాన్

హసన్‌పర్తి : మండలంలోని అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం స్మార్ట్ ఇండియా హాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. హ్యాకథాన్ ప్రాముఖ్యతను వివరించారు. వివిధ కళాశాలలకు చెందిన 130 జట్లు పాల్గొన్నాయి.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

వరంగల్ చౌరస్తా : వరంగల్ ఓసిటీలోని కనకదుర్గ మాత దేవస్థానంలో దసరా దేవి శరన్నవరాత్రుల మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాశ్ కోరారు. శుక్రవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

ఘనంగా పోషణ మాసోత్సవాలు

ఖిలా వరంగల్: వరంగల్‌లోని 32, 40, 42 డివిజన్లలోని బీరన్న కుంట, రజకవాడ, బెస్తవాడ, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉర్సు సెక్టార్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ మాసోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా సీడీపీఓ విద్య హాజరయ్యారు.

విశ్వగురువుగా భారత్‌ను నిలిపేందుకు కృషి



విద్యారణ్యపురి: ప్రపంచ వేదికపై విశ్వ గురువుగా భారత్‌ను నిలపడానికి వందేళ్లుగా రాష్ట్రీయ స్వయంసేవక సంఘం కృషి చేస్తుందని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని న్యూ శాయంపేటలోని ఓ హాల్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన దసరా ఉత్సవ కార్యక్రమంలో ఆయన ప్రధానవక్తగా పాల్గొని ప్రసంగించారు.

సమర్థవంతమైన వైద్యసేవలందించాలి

- సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఎంజీఎం : జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వయోవృద్ధులకు, మహిళలకు సీజనల్ వ్యాధులు, ప్రథమ చికిత్స, ఇమ్యునైజేషన్ మాతా శిశు సంరక్షణ వంటి కనీస వైద్య సదుపాయాలు ఉండేలా చూడాలని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ చాలాచోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవడం గానీ, ల్యాబ్ వసతి వంటివి లేకపోవడంవల్ల వయోవృద్ధులకు, స్థానికులకు పూర్తిస్థాయిలో వైద్య సదుపా యం అందడంలేదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, లక్ష్మీకాంతారావు, శంకరయ్య, ఉన్నారు.

కాజీపేట జంక్షన్‌లో రైల్వే కార్మికుల నిరసన



రైల్వే కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న యూనియన్ నేతలు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లోని రైల్వే ఎస్ఎస్ఈపీ నార్త్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఎఐఆర్ఎఫ్, ఎస్సీఆర్ఎంయూ పిలుపు మేరకు రైల్వే మజ్దూర్ యూనియన్ జమ్మికుంట బ్రాంచీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. జమ్మికుంట బ్రాంచీ సెక్రటరీ బచ్చలి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రం 8వ పే కమిషన్ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్ష కార్యదర్శులు కాల్వ శ్రీనివాస్, సిహెచ్.శంకర్‌రావు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఖాజాబాబా, పి.రవీందర్ నాయకత్వంలో కార్మికుల న్యాయమైన సమస్యలు, డిమాండ్ల సాధనకై కార్మికులు సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో జమ్మికుంట బ్రాంచీ ట్రెజరర్ ఎ.సాంబరాజు, అసిస్టెంట్ సెక్రటరి రవికుమార్, కో కన్వీనర్ ప్రవీణ్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేత

- ఏఐఎఫ్‌డబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల రాగసుధ



మాట్లాడుతున్న వంగల రాగసుధ

వరంగల్ చౌరస్తా : రాష్ట్రంలో పేద ప్రజల ప్రాణాధారమైన ఆరోగ్యశ్రీ సేవ లను గత మంగళవారం అర్ధరాత్రి నుంచి నిలిపివేయడం రాష్ట్ర ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనమని, తక్షణమే ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య(ఏఐఎఫ్‌డబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగల రాగ సుధా డిమాండ్ చేశారు. శుక్రవారం వరంగల్ అండర్ బ్రిడ్జ్ ప్రాంతంలోని ఓంకార్ భవన్ లో మంద కొమురమ్మ అధ్యక్షతన వరంగల్ జిల్లా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాగ సుధ మాట్లాడుతూ వేలాదిమంది పేద రోగులు ప్రైవేటు హాస్పటల్ లో ఫీజులు కట్ట లేని పరిస్థితుల లో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే సేవలను పునరుద్ధరించాలని, ఆసుపత్రుల బకాయిలను వెంటనే చెల్లించాలని, పేదలకు నిరంతరం వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రజల ప్రాణాలు కాపాడని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కనకం సంధ్య మాట్లాడుతూ మహిళలకు ప్రతి నెల రూ.2వేలు అందచేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి కనకం సంధ్య, జిల్లా సహాయ కార్యదర్శి సుధ, రేణుక, రాజక్క, లలిత, యమున, బిందు, అరుణ, లక్ష్మి, పాల్గొన్నారు.

నాణ్యమైన ఔషధ పరిజ్ఞానంతో ఉద్యోగాలు



మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ వాణిదేవి

మామునూరు: ఉజ్వల భవిష్యత్‌కు ఉద్యోగ మేళాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ఫార్మసీ విద్యార్థులకు ఔషధ పరిజ్ఞానంతో పాటు ఉన్నత ఉద్యోగాలు కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని వాగ్దేవి కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.వాణిదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.స్వప్నారెడ్డి అన్నారు. శుక్రవారం వరంగల్ బొల్లికుంట వాగ్దేవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బీ.ఎం.ఫార్మసీ, ఫార్మ డీ కళాశాల ఆడిటోరియంలో ఓ మెగా, హెల్త్‌కేర్, అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో వాగ్దేవి ప్లేస్‌మెంట్ సహకారంతో ఫార్మసీ విద్యార్థులకు రాతపరీక్ష ద్వారా ప్రాంగణ నియామకాలకు (ప్లేస్‌మెంట్ స్పెషల్ డ్రైవ్) నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్లేస్‌మెంట్ స్పెషల్ డ్రైవ్‌కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ, విదేశాల్లో ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. స్పెషల్ డ్రైవ్‌కు 510 మంది విద్యార్థులు హాజరు కాగా 250 మంది ఎంపికయ్యారని, కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ డాక్టర్ కే.రజిత, సీహెచ్.కిషోర్, ఎం.రమ, పి.సుమంత్, పి.మౌనిక అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలపై 18 శాతం పన్నా?

న్యూశాయంపేట : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేనేత వస్త్రాలపై జీఎస్టీని 18 శాతానికి పెంచి చేనేత పరిశ్రమను నిర్మూలించడానికే కంకణం కట్టుకున్నదా అని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రశ్నించారు. ఇటీవల జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో చేసిన నిర్ణయాలతో చేనేత రంగానికి కోలుకోలేని దెబ్బ తగిలిందన్నారు. చేనేత వినియోగదారులు డిమాండ్ చేస్తే స్పందించాల్సిన కేంద్ర ప్రభుత్వం రూ. 2500 దాటిన చేనేత వస్త్రాలపై 18 శాతం జీఎస్టీ పెంచడం దారుణమన్నారు. గతంలో ఏ ప్రభుత్వం పన్నులు విధించ లేదన్నారు.

ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబురాలు



హసన్‌పర్తి : బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, తదితరులు

గ్రేటర్ వరంగల్‌లో ముందుస్తుగా బతుకమ్మ సంబరాలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కేయూ క్యాంపస్‌లో, సీకేఎం,ఎల్‌బీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, హసన్‌పర్తి మండలం పెంబర్తిలో ఏకశిల ఈ టెక్నో స్కూల్‌లో, హనుమకొండలోని స్పెక్ట్రా స్కూల్‌లో పండుగలు ఆత్మీయతను పెంపొందిస్తామన్నారు. ప్రకృతిలో లభించే గునుగు, తంగేడు, బంతి తదితర తీరొక్క పూలతో అందమైన బతుకమ్మ పేర్చి ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి, ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి, డైరెక్టర్ గౌరు సువిజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె.స్వర్ణరాజ్, స్పెక్ట్రా స్కూల్ ప్రిన్సిపాల్ ప్రశాంతి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కళాశాలల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఉద్యోగులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



న్యూశాయంపేట: సీకేఎం కళాశాలలో..



హనుమకొండ కేడీసీలో..



హన్మకొండ : స్పెక్ట్రా స్కూల్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంతి, అతిథులు



కేయూ క్యాంపస్ : యూనివర్సిటీ పీజీ కళాశాలలో ..



రామన్నపేట : సంబురాల్లో పాల్గొన్న ప్రిన్సిపాళ్లు జ్యోతి, అరుణ డీహెచ్‌రావు